క్లుప్తంగా

ప్రభుత్వ వైద్యశాలకు వైద్య పరికరాలు



పొన్నూరు: నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలకు కెన్‌ఫిన్ కార్ప్స్ సహకారంతో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం రూ.11 లక్షల విలువైన వైద్య పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొని పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కెన్ ఫిన్ కార్ప్స్ సేవలు హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు ప్రతినిధులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ నేల దినోత్సవ వేడుకలు



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం మృత్తికా శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో గురువారం జొన్నలగడ్డ గ్రామంలో ప్రపంచ నేల దినోత్స వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిల్ సైన్స్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా సంజీవరావు మాట్లాడుతూ ప్రపంచ నేత దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. నేలల పరిరక్షణ, కొలత, యాజమాన్య పద్ధతులు వివరించారు. బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పీ ప్రసూనరాణి సేంద్రియ వ్యవసాయం, నేలల ఆరోగ్యం, యాజమాన్య పద్ధతులు వివరించారు. అనంతరం రైతులకు, వ్యవసాయ కళాశాల విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లాంఫాం శాస్త్రవేత్తలు డాక్టర్ టి.సుజాత, డాక్టర్ వి.శైలజ, డాక్టర్ బి.ఆశాజ్యోతి, డాట్ సెంటర్ కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎన్ వెంకటలక్ష్మి, డాక్టర్ వెంకటరాములు, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సువర్ణలత, ఏవో సుబ్రమణ్యం, రాజేశ్వరి రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయి వ్యవసాయంపై అవగాహన సదస్సు



గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో గ్రామీణ వ్యవసాయ పని అనుభవ కార్యక్రమాన్ని గురువారం బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు చౌడు భూముల యాజమాన్యం గురించి అసోసియేట్ డీన్ వివరించారు. ప్లాస్టిక్, సెల్ ఫోన్ల వినియోగం ప్రజలపై, విద్యార్థులపై ఎలా ప్రభావితం చేస్తుందో వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ స్వర్ణలత గ్రామ ప్రజలకు, రైతులకు, అగ్రికల్చర్ విద్యార్థినులకు జాతీయ సేవా పథకం ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ ఎం.రమాదేవి, ఏవో ఐ.సుబ్రహ్మణ్యం నేల ఆరోగ్యం, పరిరక్షణ, పొలంలో రసాయనిక ఎరువుల, పురుగు మందుల వినియోగం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థినులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి పంట మార్పిడి, నేల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్స్ డాక్టర్ వెంకటరాములు, డాక్టర్ వెంకటలక్ష్మి, గ్రామ సర్పంచ్ మబ్బు శిరీష, ఉప సర్పంచ్ నామా శ్రీనివాసరావు, రైతు వంగా నవీన్‌రెడ్డి, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లేడీస్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా మాధవి

ఏఎన్‌యూ: నాగార్జున విశ్వవిద్యాలయ మహిళా వసతి గృహ చీఫ్ వార్డెన్‌తో పాటు అడిషనల్ చీఫ్ వార్డెన్, డెప్యూటీ వార్డెన్‌లను నియమిస్తూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చీఫ్ వార్డెన్‌గా బోటనీ అండ్ మైక్రో బయాలజీ విభాగ అధ్యాపకురాలు జె.మాధవి, అదనపు చీఫ్ వార్డెన్‌గా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకురాలు వై.సునీత, ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు ఎస్. సుజనలను నియమించారు. డెప్యూటీ వార్డెన్లుగా ఏ.ఎస్.వి.రాధిక, వి.సుభాషిణి, టి. ఝాన్సీలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహాల చీఫ్ వార్డెన్‌గా అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఎం.గోపీకృష్ణ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డి.చంద్రమౌళీలకు అడిషనల్ చీఫ్ వార్డెన్ బాధ్యతలు అప్పగించారు. డెప్యూటీ వార్డెన్‌లుగా ఆర్.విజయ్ ప్రకాష్, యు. సతీష్ కుమార్, కె.ఎస్. రాజశేఖర్, సీహెచ్. పుణ్యశేఖర్, బి. విజయకుమార్‌ను నియమించారు. వీరు ఏడాది పాటు వార్డెన్లుగా విధులు నిర్వహించనున్నారు. నూతనంగా నియమితులైన వార్డెన్‌లకు వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కే. రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలంలు నియామక ఉత్తర్వులు అందజేశారు.

- రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న వేజండ్ల బాలికలు
- వాలీబాల్ పోటీల్లో వేజండ్ల జెడ్పీ విద్యార్థినుల పతకాల పంట
- ప్రత్యర్థిని చిత్తు చేయడమే లక్ష్యం

పల్లె పిల్లలు.. క్రీడా ముత్యాలు



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన వేజండ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

వేజండ్ల(చేబ్రోలు): గ్రామీణ ప్రాంతాలలో సాధారణ, నిరుపేద కుటుంబాలకు చెందిన బాలికలు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ.. క్రీడల్లో సాధన చేస్తూ, నైపుణ్యం సాధించి వాలీబాల్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. క్రీడల్లో బాలికలు సత్తా చాటుతూ గ్రామానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు గుర్తింపు తెస్తున్నారు. పల్లెటూరి పిల్లలు అయినప్పటికీ ఆటల్లో మాత్రం చిచ్చర పిడుగుల్లా రాణిస్తూ క్రీడా ముత్యాలుగా వెలుగొందుతున్నారు. అరకొర వసతులు.. అంతంత మాత్రంగా సదుపాయాలు ఉన్నప్పటికీ బాలికలు బరిలో దిగితే ఎలాంటి ప్రత్యర్థినైనా చిత్తు చేసి పాఠశాలకు పతకాల పంట పండిస్తారు. చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు వాలీబాల్ పోటీలలో పతకాల పంట పండిస్తున్నారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీలలో సత్తా చాటుతున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న పోటీలలో గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయిలో బాలికలు పతకాలు సాధిస్తున్నారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో 2021, 2023, 2024లో గోల్డ్ మెడల్స్‌ను సాధించారు. అథ్లెటిక్స్‌లో మూడు వేల మీటర్లు, లాంగ్ జంప్‌లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. సెంట్రల్ జోన్ కబడ్డీ పోటీల్లో గతంలో ప్రథమ స్థానం పొందారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వేజండ్ల జెడ్పీ హైస్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించటంతో జాతీయ స్థాయి పోటీలకు కోట నాగమల్లేశ్వరి ఎంపికయ్యింది. ఈ నెల 7వ తేదీ నుంచి వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థిని జయ సంజన పాల్గొననుంది.

రైల్వే జాబ్ చేసి స్థిరపడతా



మండల పరిధిలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన మట్టుపల్లి జయ సంజన 9వ తరగతి చదువుతుంది. ఇప్పటి వరకు నాలుగు సార్లు వాలీబాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్టులో సభ్యురాలు. పంజాబ్, బిహార్ తదితర ప్రాంతాల్లో జరిగిన వాలీబాల్ పోటీల్లో సత్తా చాటినట్లు తెలిపింది. క్రీడల్లో రాణించి రైల్వేలో జాబ్ చేసి స్థిరపడాలనేది తన లక్ష్యమని చెబుతుంది. వ్యవసాయ కుటుంబానికి చెందిన జయ సంజన అక్క దివ్యవాణి కూడా వాలీబాల్ పోటీల్లో రెండు సార్లు రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించింది.

– జయ సంజన, సుద్దపల్లి, వేజండ్ల జెడ్పీ హైస్కూల్

క్రీడల్లో రాణించి ఐపీఎస్ అవుతా



వేజండ్ల గ్రామానికి చెందిన కోట నాగమల్లేశ్వరి 8వ తరగతి చదువుతుంది. ఇప్పటి వరకు రెండు సార్లు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంది. డిసెంబరు 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు వారణాసిలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు కెప్టెన్‌గా ఎంపికై ంది. నాగమల్లేశ్వరి అక్క నాగలక్ష్మి కూడా రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంది. నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన నాగమల్లేశ్వరి క్రీడల్లో రాణించి ఐపీఎస్ సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపింది.

– కోట నాగమల్లేశ్వరి, వేజండ్ల జెడ్పీ హైస్కూల్

జాతీయ స్థాయిలో సత్తా చాటడమే లక్ష్యం



వాలీబాల్ పోటీల్లో ఇప్పటి వరకు అనేక పతకాలు సాధించిన గీతా మాధురి జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటడమే లక్ష్యంగా కృషి చేస్తుంది. గత ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించింది. వ్యవసాయ కుటుంబానికి చెందిన మాధురి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణిస్తున్నట్లు తెలిపింది.

– చల్లగిరి గీతామాధురి, సుద్దపల్లి, వేజండ్ల జెడ్పీ హైస్కూల్

ప్రభుత్వ ఉద్యోగం సాధించటమే లక్ష్యం



నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన నేను 8వ తరగతి చదువుతున్నాను. క్రీడలపై ఉన్న ఉత్సాహం మక్కువతో బాగా కృషి చేసి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తా చాటి, సెంట్రల్ జోన్, జిల్లా స్థాయిలోను ప్రతిభ కనబరిచాను. చాలా సంతోషంగా ఉంది. క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించటమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపింది.

– వెంపరాల నందిని, వేజండ్ల జెడ్పీ హైస్కూల్

ఏటా మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి



రావిపాడు(కాకుమాను): ఏటా రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించి దాని ఆధారంగా సాగు చేయాలని ఏవో బి.సుధారాణి అన్నారు. మండలంలోని రావిపాడులో ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా గురువారం నేల, దాని స్వభావంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించకుండా ఏటా ఒకే రకం సాగు చేస్తున్నారని దీని వలన భూమిలోని సారం కోల్పోవడంతో పాటు దిగుబడులు తగ్గే అవకాశాలు ఉన్నాయని ఆమె తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఏటా మట్టి నమూనా పరీక్షలు చేయించుకుని సాగు చేయాలని ఆమె సూచించారు. ఈ ఏడాది పరీక్షలు చేయించుకున్న రైతులకు నమూనా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు శివాలయంలో హుండీల లెక్కింపు

పెదకాకాని: శివాలయంలో హుండీలు తెరచి కానుకల లెక్కింపు కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని ఆలయ డిప్యూటీ కమిషనర్ కె.బి.శ్రీనివాస్ తెలిపారు. పెదకాకాని భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉదయం 9 గంటల నుంచి దేవదాయ శాఖ ఆదేశాల మేరకు హుండీలు తెరచి కల్యాణ మండపంలో లెక్కించడం జరుగుతుందన్నారు. దేవదాయ శాఖ అనుమతి పొందిన అధికారి పర్యవేక్షణలో సేవా సమితి సభ్యులచే లెక్కింపు జరుగుతుందని, నిబంధనల ప్రకారం భక్తులు పాల్గొనవచ్చని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ తెలియజేశారు.

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వండి

కమిషనర్ పీ శ్రీనివాసులు



రిజర్వాయర్ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని విలీన గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించడానికి ప్రతిపాదించిన గోరంట్ల కొండపై రిజర్వాయర్ పనులు అత్యవసరమని, అగ్రిమెంట్ మేరకు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయని కాంట్రాక్టర్‌కి నోటీసు ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కమిషనర్ గోరంట్ల కొండపై రిజర్వాయర్ పనులు, తక్కెళ్లపాడులో పంపింగ్ లైన్ మీద ఏర్పడిన లీకును పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గోరంట్ల కొండపై రిజర్వాయర్ నిర్మాణం వల్ల పలు ప్రాంతాలకు తాగునీటి కొరత తీర్చడానికి వీలు కలుగుతుందన్నారు. రిజర్వాయర్ పనులు ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగాయని, ఇక నుంచి అలా జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. రిజర్వాయర్ నిర్మాణ పనులను టెండర్ అగ్రిమెంట్ మేరకు గడువులోగా పూర్తి చేయని కాంట్రాక్టర్‌కి నోటీసులు ఇవ్వాలని, తదుపరి స్పందన మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం తక్కెళ్లపాడు గ్రామంలో గుంటూరు హెడ్ వాటర్ వర్క్స్ తాగునీటి పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకును పరిశీలించి, మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని డీఈఈని ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పైప్ లైన్లను పరిశీలిస్తూ ఉండాలన్నారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ రమేష్ బాబు, హనీఫ్, ఏఎంహెచ్ఓ ఆనందకుమార్, ఏఈలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీమన్స్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలను నంబూరు శ్రీ ప్రోలయ వేమన జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు సందర్శించినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 170 మంది 8, 9 తరగతుల విద్యార్థులు నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్, ఆంధ్రప్రదేశ్ సర్వశిక్షా అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వీవీఐటీలోని సీమన్స్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని, ఇంజనీరింగ్ విభాగాల ల్యాబ్‌లను సందర్శించారు. డిమాన్‌స్ట్రేషన్ అండ్ పాపులరైజేషన్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఫర్ స్టూడెంట్స్ అండ్ ఫ్యాకల్టీ ప్రాజెక్టు అధ్యాపకులు విద్యార్థులకు సాంకేతిక విద్య ఆవశ్యకత, కళాశాలలోని ల్యాబ్‌ల వినియోగం, వాటి పనితీరును వివరించారు. విద్యార్థులకు సాంకేతిక విద్య, పారిశ్రామిక అవసరాలపై అవగాహన కలిగించేందుకు ఈ సందర్శన అని హెచ్ఎం విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ శ్రీనివాసరావు, ఒకేషనల్ ఉపాధ్యాయురాలు భాజిమున్ని, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ కొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరుల అధ్యాపకురాలికి డాక్టరేట్



ప్రొఫెసర్ లింగమల్లు విజయ

గుంటూరు రూరల్: విద్యార్థులు, అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ రాధిక తెలిపారు. గురువారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ తమ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న లింగమల్లు విజయకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. ఆచార్య వి.శ్రీనివాస ప్రసాద్ పరిశోధనా పర్యవేక్షణలో గ్రీన్ హెచ్ఆర్ఎం ప్రాక్టీసెస్ ఇన్ ఆటోమొబైల్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇండస్ట్రీస్ ఇన్ గ్రేటర్ హైదరాబాద్ తెలంగాణ, ఏ సెక్ట్రాల్ కంపేరిసన్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలికి విజ్ఞాన్ విద్యా సంస్థల అధ్యక్షులు డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షులు ఎంపీ, లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ ఇ.వేణుమాధవి, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

రెండు రోజులు పాలిటెక్ ఫెస్ట్



గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పాలిటెక్ ఫెస్ట్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెస్ట్ గోడ ప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6, 7 తేదీలలో నిర్వహించనున్న ఫెస్ట్‌లో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని 350 మంది విద్యార్థులు సివిల్, కంప్యూటర్, మెకానికల్ తదితర విభాగాల వారీగా నూతన ఆవిష్కరణలను ప్రదర్శిస్తారన్నారు. శుక్రవారం అతిథులుగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, నియోజకవర్గ ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, ఏపీ ఫ్యాక్టరీస్ జనరల్ సెక్రటరీ కొమ్మలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారన్నారు. శనివారం కార్యక్రమాలను ఎస్బీయూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్‌కుమార్‌ప్రియా పర్యవేక్షిస్తారన్నారు. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. విద్యార్థులలో ఉన్న నైపుణ్యతను వెలికి తీసేందుకు టెక్ ఫెస్ట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇంటర్ ఒకేషనల్, ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులను ఆహ్వానించామన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను టెక్ ఫెస్ట్‌కి ఆహ్వానిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే రెవెన్యూ యంత్రాంగం

నేటి నుంచి మండల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు



తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్

పొన్నూరు: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న దరఖాస్తుల్లో రెవెన్యూకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయి. వివిధ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలను అధికారులు కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారు. కొన్నింటిని మాత్రమే పరిష్కరించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలున్నాయి. అపరిష్కృతంగా ఉన్న కొన్ని సమస్యలకు లంచం డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలూ వస్తున్నాయి. నెలల తరబడి అర్జీలు పరిష్కారానికి నోచుకోక అర్జీదారులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా సమస్యలు పరిష్కారం కాక కొందరు జిల్లా కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చిన సందర్భాలు కూడా ఉంటున్నాయి. దీంతో గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసింది.

మండలంలో 21 రోజులు

పొన్నూరు మండలంలోని 25 ప్రాంతాలలో ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు 21 రోజుల పాటు కార్యక్రమం కొనసాగుతుంది. 6న మామిళ్లపల్లి, 7న బ్రాహ్మణకోడూరు, 10న జూపూడి, 11న వెల్లలూరు, 12న దండమూడి, కట్టెంపూడి, 13న ఆరెమండ, 17న మునిపల్లె, 18న పచ్చలతాడిపర్రు 19న దొప్పలపూడి, 20న మన్నవ, 21న ఉప్పరపాలెం, సీతారాంపురం, 24న కసుకర్రు, 26న చింతలపూడి, 27న వల్లభరావుపాలెం, పెదపాలెం, 28న నండూరు, 31న ములకుదురు, జనవరి 2న మాచవరం, 3న కొండమూడి, 4న వడ్డిముక్కల, జడవల్లి, 7న నిడుబ్రోలు, 8న పొన్నూరులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సదస్సులు జరుగుతాయని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. సదస్సులో సర్వేయర్, ఆర్ఐ, వీఆర్‌వో, సహాయకులు, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్, వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్, రిజిస్ట్రేషన్ సిబ్బంది పాల్గొననున్నారు.

నేటి నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు

చేబ్రోలు: భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో 6వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ గురువారం తెలిపారు. చేబ్రోలు మండలంలోని అన్ని గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులలో గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన అన్ని సమస్యలను పరిష్కరించాలనే ప్రాథమిక లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహించటం కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రామ సభలకు తహసీల్దారు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, గ్రామ సర్వేయర్, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్‌బోర్డు అధికారులు, రిజిస్ట్రేషన్ శాఖాధికారులు, అటవీ శాఖాధికారులతో కూడిన బృందం హాజరుకానున్నారు. ఈ నెల 6వ తేదీన మంచాలలో, 10న చేబ్రోలు, 11న పాతరెడ్డిపాలెం, 12న కొత్తరెడ్డిపాలెం, 13న నారాకోడూరు, 17న గొడవర్రు, గుండవరం, 18న వేజండ్ల, 19న సుద్దపల్లి, 20న శలపాడు, శేకూరు, వీరనాయకునిపాలెం, 27న వడ్లమూడి, 28న శ్రీరంగపురం, తోట్లపాలెం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దారు తెలిపారు.

సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



నేటి నుంచి మండలంలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. మ్యుటేషన్లు, ఎల్ఈసీ కార్డుల మంజూరు, భూ వివాదాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణ, సెక్షన్ 22ఏ తారుమారు తదితర భూ సమస్యలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదులు స్వీకరించబడును.

– మహమ్మద్ జియావుల్‌హక్, తహసీల్దార్ పొన్నూరు

8న ప్రొఫెసర్ కంచ ఐలయ్య పుస్తకావిష్కరణ



గుంటూరు మెడికల్: ప్రొఫెసర్ కంచ ఐలయ్య షెపర్డ్ రచించిన 'ది క్షుద్ర రెబీలియన్' పుస్తకావిష్కరణను ఈ నెల 8న సాయంత్రం 4 గంటలకు బ్రాడీపేట 4వ లైనులోని సింధూరిలో నిర్వహిస్తున్నట్లు ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు చెప్పారు. గుంటూరు అమరావతి రోడ్డులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వియ్యన్నరావు, ప్రముఖ న్యాయవాది వై.కోటేశ్వరరావు (వైకే), లేబర్ డిపార్టుమెంట్ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు హాజరవుతున్నట్లు తెలిపారు. సాహిత్య అభిమానులు, సామాజిక కార్యకర్తలు పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనాలని న్యాయవాది వైకే కోరారు. సమావేశంలో టి.సుబ్రహ్మణ్యం, వేముల రాజా, దాసరి తిరుపతిరావు, కె.కోటేశ్వరరావు, సాంబయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇలా ఉంటే ప్రయాణం ఎలా..!?



మండలంలోని కట్టెంపూడి గ్రామ రహదారి గోతల మయంగా తయారైంది. రాకపోకలు ఎక్కువగా జరిగే ఈ రహదారిలో గుంతలు ఉండటంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ రోడ్డు పొడవునా గోతులు ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. – పొన్నూరు

బడుగుల ఆశాజ్యోతి డాక్టర్ అంబేడ్కర్



కాకుమాను: పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో గురువారం భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ముందస్తు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గేరా మాట్లాడుతూ అసమానతలు లేని సమాజం కోసం పరితపించిన మహనీయుడు అంబేడ్కర్ అని అలాంటి మహోన్నత వ్యక్తి జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శాఖా గ్రంథాలయ అధికారిణి సుభాషిణి మాట్లాడుతూ ఆనాటి సమాజంలో అంటరానితనం, సామాజిక అసమానతలను రూపుమాపుటకు అంబేడ్కర్ అలుపెరగని పోరాటం చేశారని తెలిపారు. చదువు, చదివించు అభివృద్ధి చెందు అని అంబేడ్కర్ అనేవారని చెప్పారు. విద్యార్థులు అంబేడ్కర్ వంటి మహోన్నతుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో ఉండాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు గారపాటి రమేష్, సాయిబాబు, వీరయ్య, వెంకటేశ్వర్లు, శివయ్య, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.